క్లుప్తంగా

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



గోకవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. గోకవరం శివారులో లబ్ధిదారులకు కేటాయించేందుకు అనువైన స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టుకున్న వారికి 90 రోజుల్లోనే స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోకవరానికి చెందిన లబ్ధిదారులకు 20 ఎకరాల స్థలం అవసరం కాగా ఆ మేరకు స్థానికంగా గుర్తించిన స్థలాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో అనపర్తి మార్కెట్ కమిటీ అందించిన రూ.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న మార్కెట్ షెడ్ ప్రహరీ పనులకు బుధవారం సర్పంచ్ సత్తి వీరమణి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, పడాల వీవీ సత్యనారాయణరెడ్డి, వార్డు మెంబర్లు తేతల శ్రీనివాసరెడ్డి, సత్తి ఉమామహేశ్వరరెడ్డి, సాక పుష్పవతి, సత్తి రామచంద్రారెడ్డి, పడాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదపూడి: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అండర్–17, 14 పోటీలకు తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసు బుధవారం వెల్లడించారు. అండర్–17 బాలికల విభాగంలో కేతా జ్యోతికుమారి, అండర్–14 బాలుర విభాగంలో టి.జగన్నాథం, అండర్–14 బాలికల విభాగంలో డి.హాసిని ఎంపికైనట్టు చెప్పారు. వీరంతా చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' షెడ్యూల్ విడుదల

అనపర్తి: మండలంలోని కుతుకులూరు, కొప్పవరం, దుప్పలపూడి, పొలమూరు, పులుగుర్త గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో నిర్వహించే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ప్రకటించారు. మండల పరిధిలోని 19 సచివాలయాల్లో ముందుగా పదింటి పరిధిలో నిర్వహించే కార్యక్రమానికి షెడ్యూల్ విడుదలైనట్టు ఆమె వివరించారు. గురువారం కుతుకులూరు సచివాలయం–1, పదిన కుతుకులూరు సచివాలయం–2, 14న కొప్పవరం, 15న దుప్పలపూడి, 15న అనపర్తి సచివాలయం–5, 16న అనపర్తి సచివాలయం–4, 17న అనపర్తి సచివాలయం–3, 20న అనపర్తి సచివాలయం–2, 21న అనపర్తి సచివాలయం–1, 22న పొలమూరు సచివాలయం–2, 23న పులుగుర్త గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బుధవారం తెలిపారు. గోకవరంలో ఉదయం 9 గంటలకు, జగ్గంపేట మండలం మల్లిసాలలో మధ్యాహ్నం 1 గంటకు, గండేపల్లి మండలం ఉప్పలపాడు, కిర్లంపూడి మండలం జగపతినగరంలో సాయంత్రం 3 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

పెదపూడి: సంపర గ్రామంలో అనుమానాస్పద మృతిపై ఎస్సై రామకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. సంపర గ్రామంలో నాగిరెడ్డి శ్రీను (31) ఈ నెల 3వ తేదీ రాత్రి గ్రామంలోని కె.మణి ఇంటిపైకి రాళ్లు విసిరాడు. ఆ సమయంలో మణి సోదరుడు పుష్పరాజు, ఆమె బావ రాజు కలిసి శ్రీనుపై దాడి చేశారు. అనంతరం ఈ నెల 5వ తేదీన నాగిరెడ్డి శ్రీను ఇంటి వద్ద చనిపోయాడు. దీనిపై మృతుడి శ్రీను సోదరుడు సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఉల్లికి పాట్లు

- బయట మార్కెట్‌లో కిలో రూ.60
- రైతుబజారులో రూ.45కే అందిస్తున్న ప్రభుత్వం



సామాన్యులను హడలెత్తిస్తున్న ఉల్లిపాయలు

రాజానగరం: ప్రతి కూరలో ఉల్లి తప్పనిసరి అయ్యింది.. ఇప్పుడు ఆ ఉల్లిని కోయకుండానే కంటనీరు వస్తోంది.. ధర అమాంతం పెరిగి కొండెక్కి కూర్చుంది.. మార్కెట్‌లో ఉల్లితో పాటు కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర కిలో రూ. 60 పలుకుతుంది. నిన్నటి వరకూ కిలో రూ.80 ఉన్న ఈ ధర ప్రభుత్వ జోక్యంతో రూ.60కు తగ్గింది. ఈ ధర బయట మార్కెట్‌లో ఉంటే ప్రజలకు మరింత మేలు చేకూర్చే విధంగా రైతు బజార్లలో కిలో ఉల్లి పాయలను రూ.45కే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం లాలాచెరువులోని రైతుబజార్‌లో రూ.45కే ఉల్లి అందిస్తున్నారు. సాధారణంగా బయట మార్కెట్‌లో షాపులకు సోలాపూర్, కర్నూల్, కడప తదితర ప్రాంతాల నుంచి ఉల్లి దిగుమతి అవుతుంటుంది. ఈ ఏడాది అక్కడ పంట దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గడంతో ధర పెరుగుదలకు ప్రధాన కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా చాలామంది దసరా నుంచి సంక్రాంతి వరకూ అయ్యప్పస్వామి మాల ధరించి దీక్షలో ఉంటారు. అలాగే భవానీ, శివమాలలు కూడా వేసుకుని దీక్షలు చేసేవారు అధికంగానే ఉంటారు. వీరితో పాటు ఆయా కుటుంబాల్లో వారు దీక్షలు పూర్తయ్యే వరకూ కూరల తయారీలో ఉల్లిని దూరంగా ఉంచుతారు. ఈ కారణంగా ఇతర రోజుల కంటే ఉల్లి వాడకం ఒక రకంగా ఈ సమయంలో తక్కువే చెప్పాలి. కానీ వినియోగానికి సరిపడా ఉల్లి మార్కెట్‌లోకి రాకపోవడంతోనే వాటి రేటు పెరగడానికి కారణంగా తెలుస్తుంది. ఇదిలాఉంటే కూరగాయల ధరలూ బహిరంగ మార్కెట్‌లో పెరిగాయి. వీటిని కొనేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కిలో చిక్కుడు ధర రూ.60గా ఉంది. ఇదిలాఉంటే కిలో టమాటా, వంకాయలు రూ.30 చొప్పున, బెండకాయలు, దొండ కాయలు కిలో రూ. 18 లోపునే దొరుకుతున్నాయి. ఇవికాస్త ఊరట కలిస్తున్నాయి.

రైతుబజార్లలో తక్కువ ధరకు..

సాధారణంగా అక్టోబర్ నుంచి సంక్రాంతి వరకూ వచ్చే వివిధ పండగలతో అదనపు ఖర్చులు ఉంటాయి. ఈ సమయంలోనే కూరగాయల ధరలు కూడా పెరగడం ఒకరకంగా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని, రైతుబజార్ల ద్వారా తక్కువ ధరకు ఉల్లిని అందించడం హర్షణీయం.

– పొన్నపల్లి వెంకటలక్ష్మి, సూర్యారావుపేట

డిమాండ్‌కి తగ్గట్టు ఉత్పత్తి లేక..

ఉల్లిపాయలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతోనే ధర భారీగా పెరిగింది. ప్రజల అవసరాల మేరకు ఉత్పత్తి జరిగే విధంగా చర్యలు తీసుకుంటే ధరల పెరుగుదల సమస్య ఉండదు.

– ఓదూరి గాంధీ, కూరగాయల వ్యాపారి, రాజానగరం

సంపూర్ణ ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'



కొత్తతుంగపాడు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజానగరం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న అన్నారు. ప్రజలు బాగుంటేనే రాష్ట్రం, తద్వారా దేశం బాగుంటుందనే నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. బుధవారం కొత్తతుంగపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.రవికుమార్, డాక్టర్లు సీహెచ్.వెంకటలక్ష్మి, సాయిసుధ, గోపీకృష్ణ, సీహెచ్ కృపాబాయ్ ఆధ్వర్యంలో 754 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పౌష్టికాహార ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ వివిధ రకాల ఆహార పదార్థాలతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇంట్లోనే తక్కువ ఖర్చుతో సంపూర్ణ పౌష్టికాహారాన్ని ఏవిధంగా తయారు చేసుకోవచ్చో తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. తహసీల్దార్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం.పైడిరాజు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రేపు సంపత్‌నగరంలో..

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గురు, శుక్రవారాల్లో దివాన్‌చెరువులో నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం గ్రామ సచివాలయం–2 వద్ద, శుక్రవారం గ్రామ సచివాలయం–3 వద్ద జరిగే ఈ శిబిరాలను గ్రామస్తులతో పాటు పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విప్పర్తి వీర సాయిబాబు

పెదపూడి: మండలంలో గురువారం నుంచి ఈ నెల 23 వరకూ నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ విప్పర్తి వీర సాయిబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఈ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి బుక్‌లెట్‌ను అందించి, వారి వేలిముద్రను సేకరించాలన్నారు. ఆ కుటుంబానికి ఇంతవరకూ ఏ పథకాలు అందాయి, వాటితో తృప్తి చెందారా, లేదా తెలుసుకోవాలన్నారు. వారింకా ఏ పథకానికి అర్హత కలిగి ఉంటే.. వాటి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. ఒక్కో వలంటీర్ రోజుకు పది ఇళ్లు పూర్తి చేయాలన్నారు. వలంటీర్ తమ మొబైల్ యాప్‌లో తొమ్మిది ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమానికి నోడల్ అధికారిగా ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమానికి సంబంధించి 9న పైన గ్రామంలో, 19న పుట్టకొండ, 14న పెద్దాడ, 15న పెదపూడి, 16న ఏపీత్రయం, 17న దోమాడ, 20న జి.మామిడాడ–1, 21న జి.మామిడాడ–2, 22న జి.మామిడాడ–3, 23న జి.మామిడాడ–4 సచివాలయాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, త్రినాథ్, అచ్చిరాజు, స్వామి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

రాజానగరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే తిరిగి విజయమని, దీనికి పార్టీ శ్రేణులంతా కలసికట్టుగా సాగాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, ప్రజలను కలసి ఓటు అడిగే హక్కు మనకే ఉందని అన్నారు. దివాన్‌చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జీసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, కర్తవ్యాలపై దిశానిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూనే నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో సుమారు రూ. వెయ్యి కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండల కన్వీనర్లు, జీసీఎస్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు ఒక్కో గ్రామంలో బస చేసి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన ప్రయోజనాలను ప్రజలకు గుర్తు చేసి, జగనన్నకు మద్దతు పలికేలా చైతన్యపర్చాలన్నారు. నివాస స్థలాలు పొందాల్సిన వారుంటే వచ్చే నెల రోజులలో అర్హత ఉన్న అందరికీ అందించేలా కృషి చేస్తున్నామనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరావు, అనదాస సాయిరామ్, అడబాల చినబాబు, వేమగిరి కృష్ణ, మార్గాని శ్రీను, నాళం రోశయ్య, జీసీఎస్ మండల ఇన్‌చార్జి అడబాల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సుదర్శన హోమం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: రాజానగరం నుంచి కొత్త వెలుగుబందకు వెళ్లే మార్గంలో కొత్తగా వేసిన శ్రీనివాసం లేవుట్‌లో బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దంపతులు పాల్గొన్నారు. లక్ష్మీగణపతి సహిత మహా సుదర్శన హోమం, ఆదిత్యాత్మిక రుద్ర మహా సుదర్శన హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టోత్తర శత సుదర్శన చక్రాలకు శత నామార్చన చేశారు. అనంతరం స్వాముల అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. దీక్షాధారులతో సహా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సోదరులు చిన్న, గోపిల సహకారంతో కానవరం సొసైటీ చైర్‌పర్సన్ వాడ్రేవు శ్రీనివాస్, వేదపండితులు దీక్షితులు రామకృష్ణశాస్త్రి, రేగడమిల్లి రామ్‌దేవ్‌శర్మ, దేవులపల్లి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం



గండ్రేడులో వర్మీ కంపోస్టు, చెత్తను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నుంచి పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. గండ్రేడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రం నుంచి ఎంత మేర వర్మీ కంపోస్టు ఎరువులు విక్రయించారు, క్లాప్ మిత్రల పని తీరు, తడి–పొడి చెత్త వేరు చేసే విధానంపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శిరీష, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, డీడీఓ త్రినాథ్, క్లాప్ మిత్రాలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చి, దానిని సంపదగా మార్చే ప్రక్రియ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. చెత్త సమస్యకు ఇదొక్కటే చక్కటి పరిష్కారమని చెప్పారు. వర్మీ కంపోస్టు సహజసిద్ధ ఎరువు అని, భూసారం పెంచుతుందని వివరించారు. ఈ ఎరువుకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడే పంటలతో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోందని పేర్కొన్నారు. వర్మీ కంపోస్టు వినియోగించిన పంట ఆరోగ్యకరమన్నారు. అందరికీ రాయితీపై వర్మీ కంపోస్టు అందజేయాలని సూచించారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్
- గోకవరంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం



'జగనన్నకు చెబుదాం'లో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్ చిత్రంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: పల్లెలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. గోకవరం శివారున గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో బుధవారం మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి 108 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా, మండల స్థాయి అధికారులు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని జిల్లాలో ఇప్పటి వరకూ పది మండలాల్లో నిర్వహించామన్నారు. స్థానిక సమస్యలను సచివాలయాల పరిధిలోనే పరిష్కరించామన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని పథకాల ప్రయోజనాలను పొందాలన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, డీఆర్వో జి.నరసింహులు, పర్యాటక శాఖ జేడీ వి.స్వామి నాయుడు, డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఓ డాక్టర ఎం.సనత్‌కుమారి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఎస్‌ఓ ఎస్.అబ్రహాం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ వి.నాగార్జునరెడ్డి, దాసరి రమేష్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్

రంగంపేట: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ మానుకోవాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వమే నిర్మించాలనే డిమాండ్ చేస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండలంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు డి.అప్పురూప్, కె.నాని తెలిపారు.

డీసీఎంఎస్ డైరెక్టర్ అమ్మిరెడ్డికి సన్మానం



అమ్మిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

పెదపూడి: పైనలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్ సబ్బెళ్ల అమ్మిరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఎంపీటీసీ సుందరపల్లి సుధాకర్‌బాబు, పార్టీ గ్రామ కన్వీనర్ పంపన నాగరాజు, మాజీ సర్పంచ్ కట్టా వెంకటరమణ తదితరులు ఆయనను సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉంటూ, నిరంతరం సేవలందిస్తున్న అమ్మిరెడ్డిని పలువురు కొనియాడారు. నాయకులు దాట్ల ప్రదీప్, నిమ్మగడ్డ గాయత్రి, దాట్ల సుబ్బరాజు, సూర్యనారాయణరాజు అభినందనలు తెలిపారు.

రూ.400 కోట్ల విలువైన ధాన్యం సేకరణే లక్ష్యం



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో 141 రైస్ మిల్లుల ద్వారా రూ.400 కోట్లు విలువైన ధాన్యం సేకరణ చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఒక్క రైతుకు కూడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి మైత్రీ కమిటీ సభ్యులతో ధాన్యం సేకరణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న విధానానికి ప్రస్తుత విధానానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన 21 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ప్రస్తుత ధాన్యం కొనుగోలు విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల, ఆర్బీకే స్థాయిలో రైతులకు, మిల్లర్లకు ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా జిల్లాలో మైత్రీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి ముందే టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తేమ శాతాన్ని గుర్తించాలన్నారు. ప్రతి మండలానికి ధాన్యం రవాణాకు సంబంధించి పది వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ డివైజర్లను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా వాటి నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని 83094 87151, 0883 2940788 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఎస్‌ఓ పి.భాస్కర్, డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు.